# స్వాస్థ్యానికి ఉత్తరవాదం యివ్వబడింది (1:11-14)

చిన్నవాడిగా ఉన్న దినాల్లో నీవు నిద్రపోలేనంతగా నిన్ను ఉత్సాహపరచే కుతూహలం ఏదో ఒకటి సంభవించినట్టు నీకు జ్ఞాపకం ఉండి ఉండవచ్చు.

ఫినేహాస్ నిద్రపోలేకపోయాడు. సూర్యోదయానికి ముందుగానే సిద్ధమయ్యాడు. తను ముందుగానే సర్దిపెట్టుకున్నాడు, మెట్లు దిగి క్రిందికి వచ్చాడు, ఆ దినం ఆరంభించడానికి సంసిద్ధుడైయున్నాడు. అది 1820వ సంవత్సరం. ఫినేహాస్ ఒక ద్వీపాన్ని చూడబోతున్నాడు – అది తన సొంతదైన ద్వీపం.

ఆ ద్వీపాన్ని ఫినేహాస్ తన తాత వద్దనుండి బహుమానంగా పొందాడు. కన్నెక్టికట్‌లోని ఇవ్వీ ద్వీపం అని పిలువబడే ద్వీపం యొక్క పత్రం క్రొత్తగా జన్మించినప్పుడే అతనికి యివ్వబడింది. ఆ ద్వీపాన్ని గూర్చి చిన్న వయస్సులోనే తన తండ్రులు చెప్పగా అతడు విన్నాడు. తానొక గొప్ప భూస్వామి అయిన తరువాత తమను మరచిపోవద్దని అతని తల్లిదండ్రులు అతనితో తమాషాగా మాట్లాడేవారు. తన ద్వీపాన్ని గూర్చి కలలు కంటూ, దాన్ని చూచే దినం కొరకు ఫినేహాసు ఎదురు చూస్తుండేవాడు. అతనికి తన సొంత ఆస్తి ఉంటుంది, అందమైన యిల్లు కట్టుకొని, వ్యవసాయపు భూమిని కలిగియుండి, పశువులను పెంచుకోబోతాడు.

నీకే ఒక ద్వీపం సొంతమైతే, దాన్ని చూడాలని నీకు ఆశగా ఉండదా? ఖచ్చితంగా ఉంటుంది. ఫినేహాసైతే తన ద్వీపాన్ని చూచుకునేలా తనను అక్కడికి తీసుకొని పొమ్మని తన తల్లిదండ్రులను బతిమాలాడు. కడకు అతని తల్లిదండ్రులు సమ్మతించారు. 1820 వేసవి కాలంలో, ఫినేహాసుకు చెందిన ఆ ద్వీపాన్ని తండ్రి కుమారులు చూడ బయలు దేరారు.

ప్రయాణం ఆరంభించిన తరువాత, "మనం దగ్గరకు వచ్చామా? తరువాత కొండమీద నిలిస్తే అది మనకు కన్పిస్తుందా?" అంటూ ఫినేహాసు అడుగుతునే ఉన్నాడు. మనం తొందరలోనే అక్కడ ఉంటామని అతని తండ్రి చెప్పుకుంటూనే వెళ్లుతున్నాడు.

చివరిగా, చెట్లమయమైయున్న ఒక ప్రాంతాన్ని తన తండ్రి అతనికి చూపి, "ఆ చెట్ల వెనుక అది ఉంది" అని చెప్పాడు. పెద్ద బండిలోనుండి ఫినేహాసు క్రిందికి దుమికి, ఆ చెట్లవైపు పరుగుతీయనారంభించాడు. అదురు బెదురు లేకుండ అతడు ఆ చెట్ల నడుమ తన ద్వీపాన్ని చూడ దూసుకుపోతున్నాడు. చిట్ట చివరిగా అవన్నీ దాటుకు వచ్చాడు. ఎట్టకేలకు అతడు తన ఇవ్వీ ద్వీపాన్ని చేరగలిగాడు.

తాను చూచిన దానికి ఫినేహాస్ నిశ్చేష్టుడై నిలిచాడు. అతని ఇవ్వీ ద్వీపమంతా

కలిసి అయిదు ఎకరాల పాములు తిరిగే చవిటి నేల. కన్నెక్టికట్ అంతటిలో అతని ద్వీపమే బహు ఉత్తమమైనదని అతడు చెప్పబడ్డాడు కాని, అది పనికిరానిదే. అదంతా పెద్ద జోక్ – ఒక క్రూరమైన తంత్రం. ఫినేహాసు వెనుకకు తిరిగి తన తండ్రివైపు చూచాడు, అతని తండ్రి పగలబడి నవ్వుతున్నాడు.

ఫినేహాసు నవ్వలేదు. ఆ ఫీలింగ్‌ను అతడు ఎన్నడు మరచిపోలేదు. నష్టం యొక్క భావన మెదలుతునే ఉంది. తాను మోసగింపబడినందున తాను అనుభవించిన శూన్యతనుండి అతడెన్నడు కోలుకోలేదు. వాస్తవానికి, ఫినేహాసు పెద్దవాడై ప్రజలను మోసగించే వ్యాపారం చేయనారంభించాడు.

బాలుడుగా ఫినేహాసును నీవు ఎరిగియుండవచ్చు – భూ స్వామిగా కాదు, కాని వృద్ధిచేయువాడిగా. "ప్రతి నిమిషానికి ఒక పీల్చుడుగాడు పుడుతున్నాడు" అనే మాటలను అతడు ఘనతకెక్కించాడు, అది ఎంత నిజమో చూపించడానికి అతడు తన జీవితాన్ని గడిపాడు. ఫినేహాసు పి. టి. బార్నంగా రూపొంది ఖ్యాతిగడించిన బార్నం అండ్ బెయిలీ సర్కస్‌ను రూపించాడు.[1]

స్వాస్థ్యమే లేనప్పుడు, స్వాస్థ్యమున్నట్టు కల కని, అది లేనట్టు కనుగొని నిరాశ చెందిన ఆ యువకుని గూర్చి నీవు బాధపడడం లేదా? అది ఎలాటిదైయుంటుందో మీలో కొందరికి తెలియవచ్చు. ఎందుకంటే మీరు కూడా అలాటి నష్టాన్నే చవి చూచి యుండవచ్చు. నీ సొంత భూమిని నీకెవరు వాగ్దానం చేయలేదు గాని, ఏదో ఒక దానికొరకు నీవు లెక్కలు వేసికొంటూ ఉండియుండవచ్చు. జరుగని దానిని గూర్చి నీవు కల కనియుండవచ్చు.

నీవు ఎవరితోనో వివాహపు వాగ్దానాలు తీసికొనియుండవచ్చు, అయితే అవి దాన్ని భంగం చేసి నీ హృదయం మీద చెరగని వాతగా నిలిచిపోయి ఉండవచ్చు. ఒక కంపెనీకి నీ జీవితంలో శ్రేష్ఠమైనదాన్ని యిచ్చియుండవచ్చు. వారి మాటలను నీవు పూర్ణంగా నమ్మావు. ఉద్యోగ విరమణమీద నీవు ఆధారపడ్డావు, కాని నీ ఉద్యోగాన్నే నీవు పోగొట్టుకున్నావు – లేక ఆ కంపెనీ నీ ఉద్యోగ విరమణకు ముందే దివాలా తీసి ఉండవచ్చు.

భంగం చేయబడిన వాగ్దానాలు చితికిపోయిన కలలు ఉండే లోకంలో మనం జీవిస్తున్నాం. మనం తలంచినట్టుగా మలుపు తిరుగని భవిష్యత్తుగల లోకమిది. ఈ లోకం మనకు "ద్వీపాన్ని" వాగ్దానం చేసి, కడకు మనలను నిరాశపరుస్తుంది.

దేవుని వాగ్దానాలు పూర్తిగా వ్యత్యాసమై ఉన్నాయి. తాను నెరవేర్చని వాగ్దానాన్ని దేవుడు ఎన్నడూ చేయడు. ఆయన వాగ్దానాలు జరుగక మానవు. హెబ్రీ. 10:23 దేవుని గూర్చి యిలా అంటుంది: "వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు." దేవుని వాగ్దానాలను మనం నమ్మవచ్చు. దేవుడు నమ్మదగినవాడు మాత్రమే గాక, తాను వాగ్దానం చేసినది "నెరవేర్చుటకు" శక్తిమంతుడైయున్నాడు (రోమా 4:21).

క్రీస్తునందు ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదముతో దేవుడు మనలను ఆశీర్వదించినట్టు 1:3–14లో మనం చదువుతాం. అది దేవుడు మనకు చేసిన వాగ్దానం. ఈ వాగ్దానంలో ఎక్కువ భాగం యిప్పటికే నెరవేర్చబడింది.

ఆయన మనలను ఏర్పరచుకున్న ప్రజలనుగా చేశాడు (1:4). మరియు ఆయన మనలను కుమారులనుగా స్వీకరించాడు (1:5). క్రీస్తు రక్తముచేత ఆయన మనలను విమోచించాడు (1:7) మరియు మనకు పాపక్షమాపణను ప్రోత్సహించాడు (1:7). తన కృపా మహదైశ్వర్యాన్ని మనయెడల విస్తరింపజేశాడు (1:7, 8). ఆయన తన చిత్తమును గూర్చిన మర్మమును మనకు తెలియజేశాడు (1:9), పరిశుద్ధాత్మచేత ఆయన మనలను ముద్రించాడు (1:13).

మన స్వాస్థ్యానికి సంబంధించి క్రీస్తునందు మనమెన్నడు మోసగింపబడమని అభయమిచ్చాడు. మన స్వాస్థ్యానికి పరిశుద్ధాత్మ సంచకరువుగా యివ్వబడ్డాడు. "దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ **ఆత్మ** మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు" (1:14).

నమ్మశక్యము కాని స్వాస్థ్యమును దేవుడు తన ప్రజలకు వాగ్దానం చేశాడు. అది నిరంతరం దేవునికి మహిమ తెస్తుంది.

## క్రీస్తునందు ఉండడమే మన స్వాస్థ్యమునకు ఆధారంగా వర్ణించబడింది

క్రీస్తునందు ఉండడం యొక్క ప్రాముఖ్యతను గూర్చి పౌలు ఏమి చెప్పాడో గమనించు. యూదులలోనుండి వచ్చిన క్రైస్తవులు "ఆయనయందు" ఏరి తీసికొనబడ్డారు (1:10, 11). "క్రీస్తునందు" నిరీక్షించినవారిలో వారు మొదటివారు (1:12). వారు సువార్తను విని విశ్వసించినప్పుడు అన్యజనులలోనుండి క్రైస్తవులైనవారు క్రీస్తులో చేర్చబడ్డారు (1:13). వారు ఆయనయందు వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మచేత ముద్రింపబడ్డారు. ఆయన మన స్వాస్థ్యమునకు సంచకరువుగా నిలిచియున్నాడు (1:13బి, 14ఎ).

1:11-14లో క్రీస్తులో ఉండడాన్ని గూర్చి పౌలు నొక్కి చెప్పాడు. వాస్తవానికి, "క్రీస్తునందు"[2] అనే పద ప్రయోగం 1:3-14లో వెనువెంట సందర్భంలో - ఏదో ఒక రూపంలో 9 సార్లు వస్తుంది. క్రీస్తులో ఉండడమే వ్యత్యాసమైనదిగా ఉంది. మన స్వాస్థ్యానికి ఆధారం అదే.

ఇక్కడ కొంచెంసేపు ఆగి, ఒక ప్రాముఖ్యమైన ప్రశ్నను అడగడం ఉత్తమమై ఉంటుంది: ఒక వ్యక్తి ఎలా క్రీస్తులోనికి వచ్చి, స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానాన్ని పొందుతాడు?

1:3-14 ప్రక్కనే మీ బైబిలు మార్జిన్‌లో ఈ లేఖన భాగాన్ని నీవు వ్రాసికో కోరవచ్చు:

> క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి (రోమా 6:3, 4).

బాప్తిస్మమందు మనం కల్వరి వద్దకు పయనిస్తాం. బాప్తిస్మమందు సిలువపై క్రీస్తుతో

చేరినవారమై ఆయన మరణములోనికి బాప్తిస్మం పొందుతాం. "సమాప్తమైనది" అని క్రీస్తు సిలువపై పలికినట్టు, బాప్తిస్మమందు మన గత జీవితం అంతమయ్యింది. బాప్తిస్మమందు మనం ఆయన సమాధిలో చేరతాం. బాప్తిస్మమందు నూతన జీవం పొందడానికి పునరుత్థానమందు ఆయనతో కలుసుకుంటాం.

విశ్వాసంవలన క్రీస్తులోనికి మనం బాప్తిస్మం పొందుతాం. "క్రీస్తులోనికి" మనం వచ్చి ఉండేది అలాగు. స్వాస్థ్యంతో పాటు ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదాన్ని మనం పొందేది అలాగుననే.

రెండు సత్యాలు నీవు జ్ఞాపకం ఉంచుకోవాలి. మొదటిది, క్రీస్తుకు వెలుపల, శాశ్వతంగా ఎదురు చూడగలిగింది శిక్షావిధి మాత్రమే. ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ అగ్నిజ్వాలలో ప్రత్యక్షమై, "దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికిని ప్రతిదండన చేయునప్పుడు … అట్టివారు ఆయన సముఖమునుండియు … పారదోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు" (2 థెస్స. 1:6–10). రెండవది, క్రీస్తునందు స్వాస్థ్యం, నిత్యజీవంతో పాటు ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదం పొందడం జరుగుతుంది. క్రీస్తునందు నిలిచియుండడం మన స్వాస్థ్యం యొక్క ఆధారంగా వర్ణింపబడుతుంది.

## ఆత్మను పొందడం మన స్వాస్థ్యం యొక్క నిశ్చయతను స్థిరపరచుతోంది

"మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి, **వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి**. దేవుని మహిమకు కీర్తి కలుగుటకై … **ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు**" (1:13, 14ఎ; ఒత్తి పలకడం నాది). పరిశుద్ధాత్మను గూర్చి యిది ఏమని చెప్పుతుంది?

**మొదటిగా, పరిశుద్ధాత్మ క్రైస్తవ జీవితంలో ముద్రగా ఉంటాడు.** పత్రములపై ముద్రవేసి దృఢపరచే సంగతి మనకు తెలుసు. పత్రాలపై ముద్రతో సాక్షిగా ఉండే (notary) అధికారి, పత్రంమీద సంతకం చేయబడిన తరువాత, ఆ పత్రం అధికార పూర్వకమైనదని సూచించడానికి తన ముద్ర వేస్తాడు. జాన్ మెకార్థర్ యిలా వ్యాఖ్యానం చేశాడు:

> ముద్రవేయడం అని పౌలు యిక్కడ మాట్లాడుతున్నది ఉత్తరం, కాంట్రాక్ట్ లేక యితర ప్రాముఖ్యమైన పత్రాల అధికార పూర్వకమైన గుర్తుగా వేసేదానికి సంబంధించింది. ఈ ముద్ర సాధారణంగా వేడి లక్కతో చేయబడుతుంది, ఆ తరువాత శిఖా ఉంగరంతో దానిపై నొక్కబడుతుంది.[3]

ప్రాచీన ప్రపంచంలో ముద్ర అనేది ఈ క్రిందివాటిలో ఒకటి లేక అంతకంటె ఎక్కువైనవాటిని తెలుపుతోంది:

1. **సొంతదారు తనం.** జంతువులపై లేక బానిసలపై ప్రత్యేకమైన చిహ్నాలుగా

ముద్రలు పని చేస్తాయి. నిజమైన సొంతగాడెవరో సూచించే పుస్తకాలపై ముద్రలులా అవి ఉంటాయి. అతడు లేక ఆమె దేవునికి సొంతమైన సొత్తు అని చూపడానికి పరిశుద్ధాత్మ వచ్చి క్రైస్తవునిలో నివసిస్తాడు.

2. **కాపుదల**. ఒక వస్తువుపై వేయబడిన ముద్ర – ఆ ముద్రచే ప్రాతినిధ్య మియ్యబడిన అధికారము, మరియు శక్తిచే అది కాపాడబడుతుందని ప్రజలు హెచ్చరింప బడతారు. పిలాతు ప్రభువైన యేసు యొక్క సమాధిని ముద్రించాడు (మత్తయి 27:62–66). బండను కదిలింపవద్దు అని అతని ముద్ర ప్రజలను హెచ్చరించింది. పిలాతు యొక్క ఉద్యోగ సంబంధమైన హోదా, అధికారం అతని హెచ్చరిక వెనుక బలంగా నిలిచి ఉన్నాయి – లేక ఆ హెచ్చరికను బలపరచుతున్నాయి. క్రైస్తవునిలో ఉన్న పరిశుద్ధాత్మ ఈ వ్యక్తి దేవునిచే కాపాడబడుతున్నాడని సాతానుకును, దుష్ట శక్తులకును హెచ్చరికగా ఉంటాడు.

3. **నిజ నిరూపణ**. అది దేనిమీద ఉంటుందో అది అసలైనదని ముద్ర స్థిరపరచు తుంది. క్రైస్తవునిలో ఉన్న పరిశుద్ధాత్మ, అతడు లేక ఆమె నిజముగా దేవుని బిడ్డయని, స్వాస్థ్యమునకు వారసుడని స్థిరపరుస్తాడు.

నీవు క్రీస్తునందున్నట్టయితే, పరిశుద్ధాత్మచే నీవు ముద్రింపబడినవాడవై ఉన్నావు. అది చిన్న సంగతి కాదు. మనము దేవుని సొత్తని, దేవుడు తన శక్తితో మనలను కాపాడుతున్నాడని, మనం స్వాస్థ్యమునకు నిజమైన వారసులమని ఆత్మ స్థిరపరుస్తాడు.

బర్త్ సర్టిఫికేట్స్ ప్రాముఖ్యమైన పత్రాలైయుంటాయి, కదా? స్కూల్లో చేరడానికైనా, కాలేజిలో చేరడానికైనా, ఉద్యోగానికైనా అవి అత్యవసరమైయుంటాయి, ఈ లోకం అంతమైన తరువాత దేవుని యెదుట మనము తీర్పులో నిలుస్తాం. అప్పుడు ఆయన మన బర్త్ సర్టిఫికేట్ లేదా యితర పత్రాలు నీ గుర్తింపుకొరకు చూపుమని అడుగడు. దేవుడు ముద్రకొరకు చూస్తాడు – పరిశుద్ధాత్మ ముద్ర. ఆత్మ ఏకైకమైన ముద్రయై ఉంటుంది, ఆ ముద్ర దేవునినుండి వస్తుంది, అది క్రీస్తులో ఉన్నవారికి మాత్రమే వేయబడుతుంది.

రెండవది, **పరిశుద్ధాత్మ మన స్వాస్థ్యమునకు ఉంచబడిన హామీయై ఉంటాడు**. పౌలు రచనలలో పరిశుద్ధాత్మ సంచకరువుగా (గ్రీకు.: *arrabon*) ఉంచబడినట్టు సూచింపబడ్డాడు. 1:14లో ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా లేక ఉత్తరవాదంగా ఉంచబడినట్టు సూచింపబడ్డాడు. 2 కొరింథీ. 1:22లో, "దేవుడు మనకు ముద్రవేసి, మన హృదయములలో మనకు **ఆత్మ** అను సంచకరువును అనుగ్రహించియున్నాడు" అంటే రాబోయేదానికి ఉత్తరవాదాన్ని ప్రసాదించాడు. పౌలు తిరిగి 2 కొరింథీ. 5:5లో, దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే; మరియు ఆయన "తన **ఆత్మ** అను సంచకరువును మన కనుగ్రహించి యున్నాడు" అని అన్నాడు.

ముందు చెల్లించు రుసుము లేక సంచకరువు అనేది పౌలు దినాల్లో సహజంగా ఉపయోగింపబడే పదమే. ఏదైనా కొనడానికి చెల్లించే రుసుములో భాగమైయుంటుంది. తగిన కాలంలో మిగిలినది చెల్లింపబడుతుందనడానికి యిది హామీ.

మన స్వాస్థ్యమునకు పరిశుద్ధాత్మ (హామీగా) సంచకరువుగా ఉన్నాడంటే నిజంగా

దాని అర్థమేమి? తన పిల్లలకొరకు భద్రం చేయబడిన నమ్మశక్యమైన స్వాస్థ్యాన్ని మనం పొందుతామనే నమ్మిక మనం కలిగియుండాలని దేవుడు కోరుతున్నాడు. అది "అక్షయమైనది, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము" (1 పేతురు 1:4) పరలోకమందు భద్రపరచబడియున్నది.

క్రీస్తునందు నేడు మనకు కలిగియున్నదంతా రాబోవుదానికి ముందు చవి చూడడంగా ఉండాలని దేవుడు కోరాడు. నీ పాపములు క్షమింపబడినవని నీవు ఎరిగినప్పుడు నీకు కలిగిన ఆనందాన్ని గూర్చి ఆలోచించు. ఇతర క్రైస్తవులతో కూడి దేవుని ఆరాధించేటప్పుడు నీకు కలిగే అద్భుతమైన అనుభవాన్ని గూర్చి ఆలోచించు. నేటివరకు నీ జీవితంలో కన్పించే ఆత్మ సంబంధమైన ఫలము, సంతోషము, సమాధానము, ప్రేమ అనేవాటిని గూర్చి ఆలోచించు. నీవు ఆయన బిడ్డవైన నాటినుండి నేటివరకు నీ జీవితంలో దేవుడు చేసినవాటిని గూర్చి ఆలోచించు. వీటన్నిటిని తిరిగి తిరిగి గుణించు. దేవుడు నీ కొరకు భద్రం చేసిన దానిని ఊహించడానికి ఎంతైనా చాలదు.

ఫినేహాసు తన ద్వీపంలో నిరాశపడినట్టు క్రైస్తవులు అంతం కారు. జీవితం తప్పుడు (జోక్) వేళాకోళానికో లేక నిరాశకో మార్చబడదు (త్రిప్పబడదు), క్రీస్తునందు మనకున్నది కేవలం సంచకరువు మాత్రమే. దేవుడు మనకు వాగ్దానం చేసిన నమ్మశక్యంకాని స్వాస్థ్యం యొక్క క్షణిక దర్శనం మాత్రమే.

## దేవుని స్తుతించడం మన స్వాస్థ్యం యొక్క గమ్యాన్ని గుర్తిస్తుంది

"**దేవుని మహిమకు కీర్తి కలుగుటకై** ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ **ఆత్మ** మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు" (1:14; ఒత్తి పలకడం నాది). 1:3-14వరకు గల పౌలు మాటలు దేవుని స్తుతించుటతో మ్రోగుతుంది. "మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక" (3 వ.). "తన కృపామహిమకు కీర్తికలుగునట్లు" అని వచనం 6 అంటుంది. "తన మహిమకు కీర్తి కలుగజేయవలెనని" 12వ వచనం అంటుంది. రక్షణ ఉద్దేశం, వారికి యివ్వబోయే సంపూర్ణ స్వాస్థ్యం యొక్క ఉద్దేశం "దేవుని మహిమకు కీర్తి కలుగుటయై ఉంది" అని 14వ వచనం అంటుంది.

ఆదియందు, "దేవుడు – మన స్వరూపమందు మన పోలికెచొప్పున నరులను చేయుదము" అని అన్నాడు (ఆది. 1:26). తన మహిమ, తన గుణము లేక శీలము, తన పోలికను కనుపరచే ప్రజలను సృజించాలని ఉద్దేశించాడు. ఆయనను స్తుతించి, సేవించి, ఆయనవలె ఉండ ప్రయాసపడే ప్రజలు కావాలని ఆయన కోరాడు.

ఏదియెలాగున్నా, పాపం మధ్యలో వచ్చి, నరునిలోని దేవుని స్వరూపాన్ని చెరిపింది. బైబిలు కథయంతా, దేవుని సంకల్పం యావత్తు మన నిమిత్తం దేవుడు ఆదిలో ఏది ఉద్దేశించాడో తిరిగి అక్కడికి కొనిపోవడమే. మనలను విమోచించుట, మనలను రక్షించుట, క్రీస్తునందు తిరిగి మనలను రూపించుటచేత దానిని ఆయన సాధించనైయున్నాడు

(నెరవేర్చనైయున్నాడు).

మన స్వాస్థ్యము ఎలా ఉండాలని సృజింపబడ్డామో అదే – దేవుని స్వరూపం. ఒక రోజున అది సంభవిస్తుంది. "ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము" (1 యోహాను 3:2). అది సంభవించినప్పుడు, మనం స్తుతిస్తాం! దేవుని స్తుతించడంతో మన స్వాస్థ్యము యొక్క గురి గుర్తింపబడింది.

## ముగింపు

చేతినిండుగా ఉన్న నీ కలలు బ్రద్దలైపోయాయా? నీ హృదయాన్ని ఎవరైనా విరుగగొట్టారా? ఎల్లప్పుడు నమ్ముకోవచ్చునని నీవు తలంచిన ఏదో ఒక దానిని నీవు పోగొట్టుకున్నావా?

భవిష్యత్తుకొరకైన నీ నిరీక్షణను వీడనవసరం లేదు. ఎవరి మీద ఆనుకోకూడదు, ఎవరూ నమ్మదగినవారు కారు, ఎవరిని నమ్మకూడదన్నట్టు నీకు కన్పించవచ్చు. కాని దేవుడు నమ్మదగినవాడైయున్నాడు. ఆయన నమ్మదగినవాడని నీకొకసారి ఆయనను గుర్తు చేయనిమ్ము. సర్వశక్తుడగు దేవుడు నమ్మశక్యముగాని నిత్య స్వాస్థ్యాన్ని హామీ (గ్యారంటీ) యిస్తున్నాడు అది ఎంతటి అద్భుతమైన స్వాస్థ్యమంటే, చివరిగా నీవు దానిని పొందినప్పుడు నీవు ఆయనను స్తుతించాలని, ఆయనకు నిత్యత్వమంతటిలో కృతజ్ఞతా స్తుతులు చెల్లించాలని నీకు నీవే కోరుకుంటావు!

---

సూచనలు

[1]Max Lucado, *He Still Moves Stones* (Dallas: Word Publishing, 1993), 84-85. [2]ఎడ్డీ క్లోయర్, అనుబంధం 3 చూడు. "క్రీస్తునందు" అనే పద ప్రయోగం సంఘము కొరకైన దేవుని నమూనా (Searcy, Ark.: Resource Publications, 1993), 146-65. [3]John MacArthur, Jr., *Ephesians*, The MacArthur New Testament Commentary (Chicago, Ill.: Moody Press, 1986), 34.